సాక్షి
ఖమ్మం
గురువారం । 23 । మే । 2024



పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

భూసారాన్ని పెంచేలా రైతులు సాగు చేసే పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై గురువారం నుంచి పంపిణీ చేయనున్నారు. 8లో



ఎన్నికల విధులపై అవగాహన

ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వర్తించనున్న ఉద్యోగులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. 8లో

గరిష్టం / కనిష్టం
40° / 29°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రత గరిష్టస్థాయికి చేరుతుంది.

న్యూస్‌రీల్

నకిలీ విత్తనాల కట్టడికి టాస్క్‌ఫోర్స్ బృందాలు

పోలీసు కమిషనర్ సునీల్‌దత్



సునీల్‌దత్, సీపీ

ఖమ్మంక్రైం: జిల్లాలో ఎక్కడైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ హెచ్చరించారు. నకిలీ, కల్తీ విత్తనాల రవాణా, విక్రయాలను అరికట్టేందుకు వ్యవసాయ, విత్తన కార్పొరేషన్, పోలీస్ శాఖల ఉద్యోగులతో 21 టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ బృందాలు విత్తన, ఎరువుల దుకాణాలు, గోదాముల్లో తనిఖీ చేయడమే కాక అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో నిఘా వేస్తాయని తెలిపారు. లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసినా, ఏజెంట్లు, మధ్యవర్తుల ముసుగులో నకిలీ విత్తనాలు విక్రయించినా చర్యలు తప్పవని తెలిపారు. గతంలో కేసులు నమోదైన వారిపై నిఘా ఉంటుందని, రెండోసారి పట్టుబడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని చెప్పారు. కాగా, రైతులు కూడా గుర్తింపు పొందిన దుకాణాల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలని, ఎక్కడైనా విడిగా విక్రయిస్తే పోలీసులకు లేదా వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే, ప్రతీ కొనుగోలుపై తప్పకుండా రశీదు తీసుకోవాలని సీపీ ఓ ప్రకటనలో వెల్లడించారు.

నేడు ఖమ్మంకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

ఖమ్మంమామిళ్లగూడెం: కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి గురువారం ఖమ్మంలో పర్యటించనున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యాన జిల్లాకు వస్తున్న ఆయన సాయంత్రం 4.30 గంటలకు విలేకరుల సమావేశంలో పాల్గొంటారు. ఆతర్వాత బీజేపీ ముఖ్యనేతలతో సమావేశమై ఎమ్మెల్సీ ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తారు. అనంతరం 6గంటలకు ఖమ్మంలోని సప్తపది ఫంక్షన్ హాల్‌లో జరిగే పట్టభద్రుల సమావేశంలో కిషన్‌రెడ్డి పాల్గొంటారని బీజేపీ నాయకులు తెలిపారు.

జిల్లాకు ముగ్గురు ఏఎంవీఐలు

ఖమ్మంక్రైం: జిల్లాకు కొత్తగా ముగ్గురు ఏఎంవీఐ (అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్)లను కేటాయిస్తూ రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో స్వర్ణలతను ఖమ్మంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి, కల్లూరు చెక్‌పోస్ట్‌కు సాయిచరణ్, విజయశాంతిని కేటాయించగా బుధవారం వారు విధుల్లో చేరారు. అయితే, వీరి కేటాయింపు తాత్కాలికమేనని ఎన్నికల దృష్ట్యా ప్రభుత్వం నియమించిందని రవాణా శాఖ వర్గాల ద్వారా తెలిసింది.

కేరళ అపెక్స్ బ్యాంక్‌లో డీసీసీబీ బృందం

సుగంధ ద్రవ్యాల మార్కెటింగ్‌పైనా అధ్యయనం



కేరళలోని అపెక్స్ బ్యాంకులో ఖమ్మం డీసీసీబీ బృందం

ఖమ్మంవ్యవసాయం: కేరళ విజ్ఞాన యాత్రలో ఉన్న జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) పాలకవర్గం బాధ్యులు బుధవారం అక్కడి అపెక్స్ బ్యాంకును సందర్శించారు. అలెప్పీలోని బ్యాంకు ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు, ఇస్తున్న రుణాలపై అధ్యయనం చేశారు. తొలుత టెక్కడిలోని మార్కెటింగ్ సొసైటీని సందర్శించిన బృందం సభ్యులు సుగంధ ద్రవ్యాల వ్యాపారంపైనా ఆరా తీశారు. సుగంధ ద్రవ్యాల సేకరణ, శుద్ధి, మార్కెటింగ్ వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, కృష్ణయ్య, చావా వేణు, మేకల మల్లిబాబుయాదవ్, నిర్మల పుల్లారావు, బోబోలు లక్ష్మణ్‌రావు, జనగం కోటేశ్వరరావు, పేరబత్తిని ప్రసాద్, నూకల సైదులు, కోరం జానకీరావు, మోదుగు పుల్లారావు, డీజీఎం కిరణ్, ఏజీఎం కృష్ణమోహన్ ఉన్నారు.

యథావిధిగా నడవనున్న రైళ్లు

ఖమ్మం రాపర్తినగర్: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కొంతకాలంగా మూడో లైన్ నిర్మాణ పనులతో నిలిచిపోయిన రైళ్లు గురువారం నుంచి యథావిధిగా నడుస్తాయని ఖమ్మం రైల్వే కమర్షియల్ అధికారి ఎం.డీ.జాఫర్ తెలిపారు. ఖమ్మం మీదుగా వచ్చివెళ్లే శాతవాహన, గోల్కొండ, కృష్ణ, ఇంటర్‌సిటీ, మచిలీపట్నం, గౌతమి తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిర్ణీత సమయంలో రాకపోకలు సాగిస్తాయని వెల్లడించారు.

తరగతి గదిలో టైల్స్ వేసి బిగించిన ఫ్యాన్లు



బోనకల్ మండలం నారాయణపురం పాఠశాలలో సిద్ధమైన అదనపు టాయిలెట్లు



వాటర్ క్యాన్ ఆకృతిలో నిర్మించిన ట్యాంక్



బడికి కొత్త అందం!

ప్రభుత్వాలు మారినా.. విద్యావ్యవస్థ అభివృద్ధిపై పాలకుల ఆలోచనలు ఏ మాత్రం తగ్గడం లేదు. గత ప్రభుత్వం మన ఊరు – మన బడి ద్వారా పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించింది. ప్రస్తుత ప్రభుత్వం సైతం విద్యావ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా గతంలో అభివృద్ధి చేసిన పాఠశాలలే కాక మిగిలిన అన్ని పాఠశాలలను తీర్చిదిద్దడంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగానే అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను నియమించింది. జిల్లాలోని 21 మండలాల పరిధిలోని 753 పాఠశాలలను ఈ కమిటీల ద్వారా బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే రూ.2,138లక్షల నిధులు కేటాయించగా, ఇందులో విడుదలైన రూ.518.50 లక్షలతో పనులు చకచకా జరుగుతున్నాయి. – ఖమ్మం సహకారనగర్



రంగులతో కళకళలాడుతున్న ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి పాఠశాల భవనం

వసతుల కల్పనతో మారుతున్న రూపురేఖలు

- రూ.2,138.623 లక్షలతో పనులు
- ఇప్పటికే 217 పాఠశాలల్లో పూర్తి
- మిగిలినవీ విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే నాటికి పూర్తిచేసేలా కసరత్తు

అన్ని వసతులు

పాఠశాలల్లో కనీస మౌలిక వసతులైన టాయిలెట్ల నిర్మాణం, తాగునీరు, విద్యుత్ సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈమేరకు ప్రణాళిక సిద్ధం చేసి పనులు చేపడుతుండగా.. అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. ఇందులో ఇప్పటికే 217పాఠశాలల్లో పనులు పూర్తి కావడంతో కళకళలాడుతున్నాయి. మిగతా పాఠశాలల్లో కూడా విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే నాటికి పూర్తిచేయాలనే లక్ష్యంతో అధికారులు ఉన్నారు.

కలిసొచ్చిన ఎన్నికలు

జిల్లాలోని 438 పాఠశాలల్లో లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఇందులో చాలా వరకు పాఠశాలలకు అమ్మ ఆదర్శ కమిటీల ఎంపిక అప్పటికే పూర్తయింది. దీంతో పోలింగ్ కేంద్రాలు ఉన్న పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించిన ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్(ఆర్‌ఓ), కలెక్టర్ వీ.పీ.గౌతమ్ పనుల పురోగతిని నిత్యం పర్యవేక్షించారు. దీంతో భవనాలకు రంగులు వేయడమే కాక అవసరమైన చోట టాయిలెట్లు, ప్రహరీలు నిర్మించారు. అంతేకాకుండా పోలింగ్ తేదీ నాటికి విద్యుత్, తాగునీటి వసతి కూడా కల్పించారు.

పునఃప్రారంభానికి ముస్తాబు

వచ్చేనెల 12న విద్యాసంవత్సరం పునఃప్రారంభమవుతుంది. అప్పటిలోగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా పాఠశాలల్లో పనులన్నీ పూర్తిచేయాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అయితే, 753 పాఠశాలలకుగాను 217 పాఠశాలల్లో పూర్తిస్థాయిలో పనులు చేపట్టారు. మిగతావి కూడా పురోగతిలో ఉన్న నేపథ్యాన మరింత వేగంగా జరిగేలా అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

పూర్తి చేస్తాం...

వచ్చే నెల 12న పాఠశాలలు తెరిచే నాటికి పనులన్నీ పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాం. అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా జిల్లాలోని 753 పాఠశాలల్లో కనీస మౌలిక వసతుల కల్పన జరుగుతోంది. ఇప్పటికే పలు పాఠశాలల్లో పనులు పూర్తికాగా... మిగిలినవీ త్వరగా పూర్తిచేసేలా నిరంతరం పరిశీలిస్తున్నాం. ఆయా పనులపై కలెక్టర్ గౌతమ్ నిత్యం పర్యవేక్షిస్తూ సూచనలు చేస్తున్నారు.

– సోమశేఖరశర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

వివరాలిలా ..	ప్రాథమిక పాఠశాలలు	ప్రాథమికోన్నత పాఠశాలలు	ఉన్నత పాఠశాలలు	మొత్తం
	505	136	112	753

పనుల విలువ	విడుదలైన నిధులు	పనులు పూర్తయిన	పురోగతిలో ఉన్నవి
రూ.2,138.623 లక్షలు	రూ.518.50 లక్షలు	పాఠశాలలు 217	536

నెలాఖరులోగా 'ధరణి' పరిష్కారం

కలెక్టర్ గౌతమ్ ఆదేశం

ఖమ్మం సహకారనగర్/కూసుమంచి: ధరణి సైట్‌లో పెండింగ్ ఉన్న దరఖాస్తులను నెలాఖరు నాటికి పరిష్కరించేలా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కూసుమంచి తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం తనిఖీ చేసిన ఆయన తహసీల్దార్ సురేష్‌తో ధరణి దరఖాస్తులపై ఆరా తీశారు. మండలంలో ఇప్పటి వరకు 380 దరఖాస్తులు, 15 రిజిస్ట్రేషన్ స్లాట్లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పగా వీటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం కూసుమంచిలోని కల్లూరుగూడెం సహకార సంఘంలో రైతులకు జీలుగు విత్తనాలను పంపిణీ చేస్తుండగా కలెక్టర్ పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తున్నట్లు చేసిన ప్రకటనను రైతులకు వివరించిన కలెక్టర్ విత్తనాలు, ఎరువుల సరఫరాపై ఆరా తీయగా ఇప్పటివరకు ఇబ్బందులేమీ లేవని రైతులు తెలిపారు. ఆతర్వాత కలెక్టరేట్ నుంచి వీసీ ద్వారా కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆర్డీఓలు, తహసీల్దార్లతో మాట్లాడి ధరణి పెండింగ్ దరఖాస్తులను నెలాఖరులోగా పరిష్కరించేలా రోజుకు 25 ఫైళ్లు సమర్పించాలని సూచించారు.



ఖమ్మం రూరల్ : జలగంనగర్‌లో యూనిఫామ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

పాఠశాలలు తెరిచే నాటికి యూనిఫామ్

ఖమ్మంరూరల్: పాఠశాలల ప్రారంభం నాటికి విద్యార్థులకు పంపిణీ చేసేలా యూనిఫామ్ సిద్ధం చేయాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. ఖమ్మం రూరల్ మండలం జలగంనగర్‌లోని మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేసి వివరాలు ఆరా తీశారు. యూనిఫాంల తయారీ బాధ్యతను మహిళా, స్వయం సంఘాల గ్రూపులకు ఇవ్వడంతో వారు ఆర్థికంగా బలోపేతమవుతారని తెలిపారు. జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్, మేనేజర్ శ్రీలత, ఎంపీడీఓ కుమార్, ఏపీఎం శ్రీనివాసరావు, సీసీ మోహన్‌రావు, శారద పాల్గొన్నారు.

వరద తాకిడిని తట్టుకునేలా కరకట్ట



కరకట్ట నిర్మాణ ప్రణాళికలను పరిశీలిస్తున్న అధికారుల బృందం

నిర్మాణ పనులపై సీఈల సూచనలు

ఖమ్మంఅర్బన్: వరద తాకిడిని తట్టుకునేలా ప్రణాళికాయుతంగా కరకట్ట నిర్మాణ పనులు చేపట్టాలని క్వాలిటీ కంట్రోల్ సీఈ వెంకటకృష్ణ, సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీఓ) సీఈ మోహన్ కుమార్ సూచించారు. గత ఏడాది వర్షాకాలంలో వరదలకు మున్నేరు పోటెత్తగా ఖమ్మం నగరంతోపాటు ఖమ్మం రూరల్ మండలంలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. ఈనేపథ్యాన ఇరువైపులా 17 కి.మీ. కరకట్టగా రిటైనింగ్ వాల్స్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.690 కోట్ల నిధులు కేటాయించింది. ప్రస్తుతం దానవాయిగూడెం ప్రాంతంలో పనులు ప్రారంభమవుతున్న దృష్ట్యా అధికారులు బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ప్రస్తుతానికి భూసేకరణ అవసరం లేని ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేపట్టనుండగా మట్టి పనులు పూర్తి చేసి కాంక్రీట్ పనులకు సిద్ధమయ్యారు. ఈనేపథ్యాన పరిశీలించిన సీఈలు మాట్లాడుతూ లూజ్ మట్టి పూర్తిగా తొలగించి కాంక్రీట్ పనులు చేపట్టాలని, బేస్‌మెంట్ పటిష్టంగా ఉండేలా కాంక్రీట్‌ను మందంగా వేయించాలని అధికారులకు సూచించారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిత్యం పర్యవేక్షించాలని తెలిపారు. పనులు వేగంగా జరిగేలా చూస్తూనే భూసేకరణపై ఇతర శాఖల అధికారులతో సమన్వయంతో వ్యవహరించాలని తెలిపారు. అనంతరం ఏన్కూరు మండలంలో సీతారామ ప్రాజెక్టు 18 లింక్ కాల్వ పనులను సైతం సీఈలు పరిశీలించారు. ఈకార్యక్రమంలో జల వనరుల శాఖ ఖమ్మం, భద్రాద్రి సీఈలు విద్యాసాగర్, శ్రీనివాస్‌రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ ఎస్‌ఈ దేవేందర్‌గౌడ్, రెండు జిల్లాల అధికారులు నర్సింగరావు, శ్రీనివాస్‌రెడ్డి, మంగళపుడి వెంకటేశ్వర్లు, అనన్య, అర్జున్, చంద్రమోహన్, ఉదయ్‌ప్రతాప్, మన్మథరావు పాల్గొన్నారు.

చట్టసభలో యువవాణి వినిపిస్తా..

- బాల్యంలోనే ఎర్రజెండా ఉద్యమాలపై మక్కువ
- మహానేత వైఎస్సార్ పథకాలతో రాజకీయాలపై ఆసక్తి
- అంతర్జాతీయ మిమిక్రీ కళాకారుడు, ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి రమేశ్



కొత్తగూడెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మిమిక్రీ రమేశ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ తేదీ సమీపించింది. ఈ ఎన్నికలను ఇటు కాంగ్రెస్ మిత్ర పక్షాలు, అటు ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ సవాల్‌గా తీసుకుని గెలుపే లక్ష్యంగా శ్రమిస్తున్నాయి. ఈ మూడు పార్టీల నడుమ స్వతంత్ర అభ్యర్థిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన మిమిక్రీ రమేశ్ బరిలో నిలిచారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల స్థానం నుంచి పోటీ చేయడానికి గల కారణాలను రమేష్ వివరించారు.

ఎన్టీఆర్ స్ఫూర్తితో..

నేను పుట్టి పెరిగిందంతా కొత్తగూడెంలోనే. ఆ రోజుల్లో సింగరేణిలో కార్మికుల హక్కుల కోసం కమ్యూనిస్టులు పోరాటాలు చేసేవారు. దీంతో సహజంగానే ఎర్రజెండా భావజాలం పట్ల ఆకర్షణ ఉండేది. ఇదే సమయంలో చిన్నప్పటి నుంచి సినిమాలు బాగా చూడటం అందులోని నటులను అనుకరించే అలవాటు ఉండేది. ముఖ్యంగా సినిమా టైటిల్స్‌లో నందమూరి తారక రామారావు బీఏ అని పేరు పడటం చూసి చిన్నప్పుడే బీఏ చదవాలని నిర్ణయించుకున్నాను. ఇబ్బందులు ఎదురైనా పట్టుదలతో డిగ్రీ పూర్తి చేశాను.

జర్నలిస్టుగా..

విద్యార్థి దశ ముగిసిన తర్వాత జర్నలిస్టుగా ప్రింట్ మీడియాలో ప్రయాణం మొదలైంది. వివిధ పత్రికల్లో పని చేసిన తర్వాత ఎలక్ట్రానిక్ మీడియా వైపు వెళ్లాను. అప్పటికే మిమిక్రీ ఆర్టిస్టుగా బాగా గుర్తింపు ఉండటంతో టీవీ రంగంలో రాణించాను. అయితే జర్నలిస్టుగా రాజకీయాలను దగ్గర నుంచి పరిశీలించే అవకాశం వచ్చింది.

ఇండిపెండెంట్‌గా..

యువత ఆశలు, ఆకాంక్షలు చట్టసభల్లో బలంగా వినిపించే గొంతు కావాలి. ఇప్పుడు ప్రధాన పార్టీల అభ్యర్థులు తమను గెలిపించిన పట్టభద్రుల కంటే ప్రాతినిధ్యం వహించే పార్టీలకే ఎక్కువగా కట్టుబడి ఉంటున్నారు. అందువల్లే చదువుకున్న యువత వాణిని చట్ట సభల్లో స్వేచ్ఛగా వినిపించేందుకు ఖమ్మం- నల్గొండ -వరంగల్ పట్టభద్రుల స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నాను. ఒక కళాకారుడిగా ప్రజల ఇబ్బందులను ప్రజావేదికలపై బలంగా వినిపిస్తూ వచ్చాను. పట్టభద్రుల మద్దతు లభిస్తే చట్టసభల్లో సమస్యలపై గళం విప్పుతా.

మిమిక్రీ ఆర్టిస్టుగా..

మిమిక్రీ ఆర్టిస్టుగా నాకుఅంతర్జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చింది. దేశం నలుమూలల ప్రదర్శనలు ఇచ్చాను. అమెరికాలో ఇరవైకి పైగా స్టేజీ షోలు చేశాను. ఆస్ట్రేలియా, దుబాయ్, బహ్రెయిన్, కువైట్, ఉగాండా లాంటి దేశాల్లో తెలుగువారు ప్రదర్శనలు ఇచ్చాను. జర్నలిస్టుగా, మిమిక్రీ కళాకారుడిగా విజయవంతమైన నేను ఇప్పుడు ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ద్వారా రాజకీయ ప్రయాణం మొదలెడుతున్నాను.

వైఎస్సార్‌ను చూసి..

మిమిక్రీ ఆర్టిస్టుగా వందలాది మంది ప్రముఖుల గొంతులను అనుకరిస్తూ షోలు చేశాను. ఈక్రమంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ కన్నుమూశాక నిర్వహించిన అనేక సభల్లో ఆయన్ని అనుకరిస్తూ మాట్లాడేవాడిని. ఈక్రమంలోనే ఆయన ప్రవేశపెట్టిన 108, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను ప్రస్తావిస్తున్నప్పుడు సభికుల నుంచి విశేష స్పందన లభించేది. ఆ కార్యక్రమం తర్వాత నా మిమిక్రీని మెచ్చుకుంటూనే వైఎస్సార్ హయాంలో తమ బతుకుల్లో వచ్చిన మార్పు గురించి చాలా మంది నా దగ్గర ప్రస్తావించేవారు. ఆ సమయంలో వారు చెబుతున్న విషయాలు వింటే గుండె బరువెక్కేది. అది క్రమంగా పెరుగుతూ వచ్చి, రాజకీయాలను చూడడమే కాదు అందులోకి వెళ్లాలనే నిర్ణయానికి వచ్చాను.

మరింత మెరుగ్గా వైద్యం

- జిల్లాలో తొలి విడతగా 66 కేంద్రాల ఎంపిక
- జాబితాలో పీహెచ్‌సీలు, యూహెచ్‌సీలు, పల్లె దవాఖానాలు
- 12 రకాల సేవలు అందుబాటులోకి...
- విడతల వారీగా పూర్తిస్థాయిలో విస్తరణ



ఖమ్మంవైద్యవిభాగం: ప్రభుత్వం క్షేత్రస్థాయిలో వైద్యసేవలను మరింత విస్తరించేందుకు సిద్ధమైంది. అందులో భాగంగానే జిల్లాలోని పలు ఆరోగ్య కేంద్రాల్లో ప్రస్తుతం అందుతున్న సేవలకు తోడు మరిన్ని వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్) ద్వారా ఇప్పటివరకు అందిస్తున్న ఐదు రకాల సాధారణ సేవలతో పాటు ఏడు రకాల ప్రత్యేక సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈమేరకు తొలివిడతగా జిల్లాలోని 66 కేంద్రాలను ఎంపిక చేశారు. ఇందులో 26 పీహెచ్‌సీలు, నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. ఇక జిల్లాలోని 224 సబ్ సెంటర్లలో 161 కేంద్రాలను ప్రభుత్వం పల్లె దవాఖానాలుగా మార్చగా, వీటిలో 36 కేంద్రాల్లో కూడా అదనపు వైద్యసేవలు అందజేయాలని నిర్ణయించారు.

పెద్దాస్పత్రులకు వెళ్లనవసరం లేకుండా..

క్షేత్ర స్థాయిలో వైద్యరంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆరోగ్య కేంద్రాలు, పట్టణాలకు సుదూరంగా ఉండే పల్లె దవాఖానాల్లో సేవలు పెంచాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రధానంగా పల్లెల ప్రజలకు సమీపంలోనే వైద్యం అందించాలని, తద్వారా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే బాధ తప్పించాలని ప్రభుత్వ భావనగా చెబుతున్నారు. ఇప్పుడు డయోగ్నస్టిక్ హబ్ ద్వారా వివిధ రకాల పరీక్షలు చేస్తున్నారు. పీహెచ్‌సీ స్థాయిలో శాంపిళ్లను సేకరించి జిల్లా కేంద్రంలోని హబ్‌కు పంపించి 24 గంటల్లో వారి సెల్‌ఫోన్‌కు నివేదిక పంపిస్తారు. దీంతో మెడికల్ ఆఫీసర్ పరిశీలించి వైద్యం అందించే వీలు కలుగుతోంది. ప్రస్తుతం మరిన్ని వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొస్తే ప్రజలు వ్యయప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి రావాల్సిన ఇక్కట్లు తప్పనున్నాయి.

ఐదు నుంచి 12కు...

జిల్లాలో ఎంపిక చేసిన 66 కేంద్రాల్లో 12 రకాల వైద్య సేవలు అందించనున్నారు. ప్రస్తుతం ఆయా కేంద్రాల్లో మాతా శిశు సంరక్షణ, వ్యాక్సినేషన్, కుటుంబ నియంత్రణ, అంటువ్యాధుల నియంత్రణ, సాధారణ వ్యాధులకు చికిత్స అందుతోంది. వీటికి తోడు ఈఎన్‌టీ, ఆప్తాల్మిక్, డెంటల్, మానసిక, పాలియేటివ్ కేర్, 65 ఏళ్లు దాటిన వారికి ఎల్డర్లీ హెల్త్ కేర్, ఎన్‌సీడీ సేవలు సైతం అందించనున్నారు. తొలి విడత 66 కేంద్రాలనే ఎంపిక చేసినప్పటికీ క్రమక్రమంగా ఈ సేవలు మిగతా ఆరోగ్య కేంద్రాలకు సైతం విస్తరించనున్నారు.

వైద్యులకు శిక్షణ, కొత్త నియామకాలు



ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలు విస్తృతం కానున్నాయి. ప్రస్తుతం అందుతున్న చికిత్సలకు తోడు ఇంకో ఏడు అందుబాటులోకి వస్తాయి. తద్వారా ప్రజలకు ప్రయోజనం ఉంటుంది. ఎంపిక చేసిన కేంద్రాల్లోని వైద్యులకు శిక్షణ ఇచ్చి వైద్యసేవలు మెరుగు పరుస్తాం. అవసరమైన చోట వైద్యులను నియమిస్తాం.

– బి.మాలతి, డీఎంహెచ్‌ఓ

'తల్లి'డిల్లుతున్న హృదయం

- చిన్నారి కానరాక 48గంటలు
- బిడ్డ పాలు తాగాడో, లేదోనని రోదిస్తున్న తల్లి

సత్తుపల్లి: పదకొండు నెలల పసికందు.. తల్లిపాలు తప్ప పోతపాలు తాగని బిడ్డ.. ఎత్తుకెళ్లిన వారు పాలైనా తాగించారో, లేదోనని కన్నతల్లి హృదయం తల్లడిల్లిపోతోంది. సత్తుపల్లి పట్టణం గుడిపాడు శివారులో గుడారాలు వేసుకుని నివసిస్తున్న తల్లిదండ్రుల చెంత నిద్రిస్తున్న 11 నెలల పసికందు సాయి దేవాన్ష్ సోమవారం అర్ధరాత్రి నుంచి కానరాకుండా పోయిన విషయం విదితమే. బిడ్డ కనిపించక 48గంటలు అవుతుండడంతో తల్లిదండ్రులు వానరాశి జంపన్న – దుర్గ కంటిమీద కునుకు లేకుండా రోదిస్తున్నారు. తమ లాంటి పేదోళ్ల బిడ్డను ఎత్తుకెళ్లిన వారికి మనసెలా ఒప్పిందని కన్నీరుమున్నీరవుతున్నారు. ఏక్షణం బిడ్డను వదిలి ఉండలేదు.. పనికి వెళ్లేటప్పుడు కూడా తీసుకెళ్లేవాళ్లమని వారు రోదిస్తుండగా.. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉండే వాళ్లు ఓదారుస్తున్నారు.

పనిచేయని సీసీ కెమెరాలు

గుడారాల వద్ద రోడ్డుకు ఇరువైపులా సీసీ కెమెరాలు ఉన్నా పనిచేయడం లేదని తెలిసింది. అయితే, రెండు, మూడు రోజులుగా ఓ కారు, ఆటో రాత్రి వేళ వచ్చివెళ్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. బాలుడు అదృశ్యమైన రోజు సైతం కారు, ఆటో తిరిగాయని సమాచారం. ఈమేరకు సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించగా.. ఓ వాహనం వేగంగా వెళ్తున్నట్టు గుర్తించారని తెలిసింది. కాగా, బాలుడి కిడ్నాప్ కేసును ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేస్తున్నట్లు సత్తుపల్లి పట్టణ సీఐ టి.కిరణ్ తెలిపారు.



సాయి దేవాన్ష్



రోదిస్తున్న తల్లి దుర్గ

క్లుప్తంగా

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మంస్పోర్ట్స్: హైదరాబాద్‌లో జరగనున్న టీ–20 క్రికెట్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టును గురువారం ఎంపిక చేశారు. అండర్–23 విభాగంలో ఖమ్మంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 105 మంది క్రికెటర్లు హాజరయ్యారు. వీరితో పాటు ఇప్పటికే వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న క్రికెటర్ల నుంచి జట్టును ఎంపిక చేశారు. ఈ మేరకు జిల్లా జట్టుకు టీవీఎస్.నారాయణ, ఎస్‌కే సమీర్, వంశీ, సాయిచంద్, విశాల్‌యాదవ్, తేజ్‌రామ్, నాగేంద్ర, ఫరీద్, లోకేశ్, సమీర్, రియాజ్, శశి, బన్నీ, మహిత్, శివాన్, దివాన్ ఎంపికయ్యారని క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సీహెచ్.వెంకట్ తెలిపారు. కార్యక్రమంలో ఎండీ ఫారుఖ్‌ఖాన్, తురాబ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ప్రత్యేక కమిషనర్ శేషకుమార్



చింతకాని మండలం వందనంలో నర్సరీని పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ శేషకుమార్, అధికారులు

రఘునాథపాలెం/చింతకాని: గ్రామాల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ప్రత్యేక కమిషనర్ ఎం.శేషుకుమార్ సూచించారు. రఘునాథపాలెం మండలంలోని కోటపాడు, కోయచలక, చింతకాని మండలం వందనంలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన వివిధ పనులు, వాటి పురోగతిని పరిశీలించారు. పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాలు, నర్సరీలు, డంపింగ్ యార్డులను పరిశీలించిన ఆయన నిర్వహణపై సూచనలు చేశారు. ఈకార్యక్రమాల్లో జెడ్పీ సీఈఓ వినోద్, డీఆర్డీఓ సన్యాసయ్య, డీపీఓ హరికిషన్, ఎంపీడీఓలు ఆశోక్, రామయ్య, ఎంపీఓలు శ్రీనివాస్‌రెడ్డి, ఎం.రవీంద్రప్రసాద్‌తో పాటు ఉద్యోగులు శ్రీదేవి, పద్మయ్యనాయుడు, అనూప్, సురేష్, మున్వర్, శృతి, కోటయ్య, చెవుల మహేష్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సత్తుపల్లికి మాజీ మంత్రి హరీశ్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య


సత్తుపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్న ఏనుగుల రాకేశ్‌రెడ్డి విజయానికి పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సూచించారు. సత్తుపల్లిలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 24వ తేదీ శుక్రవారం సత్తుపల్లిలో జరిగే ఆత్మీయ సమ్మేళనానికి మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, ఖమ్మం, నాగర్‌కర్నూలు ఎంపీ అభ్యర్థులు నామా నాగేశ్వరరావు, ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ రానున్నందున పట్టభద్రులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈసమావేశంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఎంపీపీ దొడ్డా హైమావతి, బీఆర్‌ఎస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు ఎస్.కే.రఫీ, యాగంటి శ్రీనివాసరావుతో పాటు కొత్తూరు ఉమామహేశ్వరరావు, దొడ్డా శంకర్‌రావు పాల్గొన్నారు.

బీర్లు లేవు.. ఐబీ అమ్మడం లేదు!

ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు

పాల్వంచరూరల్: వేసవిలో చల్లటి బీర్లతో పాటు ఇంపీరియల్ బ్లూ మద్యం వైన్స్‌లలో అమ్మడం లేదని పాల్వంచ మండలం రెడ్డిగూడెంకు చెందిన జైపాల్‌రెడ్డి బుధవారం జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. డిమాండ్ ఉన్న కింగ్ ఫిషర్‌తోపాటు ఇతర బీర్లు, మద్యం లేదంటూ వైన్స్ నిర్వాహకులు కొరత సృష్టిస్తున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే, బెల్టుషాపుల్లో మాత్రం అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలిపారు. కాగా, బీర్ల కొరత విషయం తన దృష్టికి రాలేదని, దీనిపై ఆరా తీస్తామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య చెప్పారని జైపాల్‌రెడ్డి వెల్లడించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,229

పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

అందుబాటులో జీలుగు, పిల్లి పెసర, జనుము విత్తనాలు

- 50 శాతానికి పైగా సబ్సిడీపై అందుబాటులోకి..
- ఉమ్మడి జిల్లాలో 25 వేల క్వింటాళ్లకు పైగా పంపిణీకి ప్రణాళిక
- పీఏసీఎస్‌లు, ఆగ్రో సేవా కేంద్రాల ద్వారా నేటి నుంచి విక్రయాలు



పచ్చిరొట్టను కలియదున్నతున్న రైతు (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: వానాకాలం సీజన్ సమీపిస్తుండటంతో ప్రభుత్వం పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఖమ్మం ప్రాంతీయ కార్యాలయం నుంచి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. ఉపరితల ఆవర్తనం కారణంగా అక్కడక్కడా వర్షాలు కురుస్తుండటంతో రైతులు వివిధ రకాల పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యాన పంటల సాగుకు ముందు పచ్చిరొట్ట విత్తనాలను చల్లుకోవడం ఆనవాయితీ. భూసారాన్ని పెంపొందించటానికి పచ్చిరొట్ట పైర్ల సాగు దోహదం చేయనుండగా, ఆ తర్వాత సాగు చేసే పంటలకు పెట్టుబడి కూడా తగ్గుతుంది. భూసారం పెరగానికి కంపోస్ట్, వర్మీ కంపోస్ట్, కోళ్లు, గొర్రెల ఎరువులను గతంలో వినియోగించగా.. ఇప్పుడు కొరత ఏర్పడడంతో పచ్చిరొట్ట ఎరువులు సాగుచేస్తున్నారు. ఈ నేపథ్యాన జీలుగు, పిల్లి పెసర, జనుము తదితర పచ్చిరొట్ట పైర్ల విత్తనాలను ప్రభుత్వాలు రైతులకు సబ్సిడీపై సరఫరా చేస్తున్నారు. ప్రధానంగా వరి, మిరప, ఉద్యాన పంటలు సాగు చేసే భూముల్లో రైతులు పచ్చిరొట్ట ఎరువులను వినియోగిస్తున్నారు.

వ్యవసాయ శాఖ ఇండెంట్ ఆధారంగా..

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులు సమర్పించిన ఇండెంట్ ఆధారంగా పచ్చిరొట్ట విత్తనాలను విత్తనాభివృద్ధి సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఖమ్మం జిల్లాలో 21,276 క్వింటాళ్లు, భద్రాద్రి జిల్లాలో 4,394 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని నివేదిక ఇచ్చారు. ఖమ్మం జిల్లా ఇండెంట్‌లో జీలుగు 19,100 క్వింటాళ్లు, జనుము 1,904 క్వింటాళ్లు, పిల్లిపెసర 272 క్వింటాళ్లు ఉండగా, ఇప్పటి వరకు జీలుగు 9,972 క్వింటాళ్లు, జనుము 980 క్వింటాళ్లు, పిల్లి పెసర 40 క్వింటాళ్లు రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇండెంట్‌లో జీలుగు 3,900 క్వింటాళ్లు, జనుము 422, పిల్లిపెసర 72 క్వింటాళ్లు ఉండగా, ఇప్పటి వరకు జీలుగు 2,012 క్వింటాళ్లు, జనుము 298 క్వింటాళ్ల మేర అందుబాటులో వచ్చాయి. జీలుగు విత్తనాలను ఆగ్రా, ఢిల్లీ నుంచి, జనుము, పిల్లి పెసర విత్తనాలను మెదక్, రంగారెడ్డి జిల్లాల నుంచి సమకూరుస్తున్నారు.

విత్తనాలపై సబ్సిడీ

సేంద్రియ ఎరువును ప్రోత్సహించడంలో భాగంగా పచ్చిరొట్ట విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తోంది. జీలుగు విత్తనాలకు 55.80, జనుము 54.30, పిల్లి పెసరకు 81.30 శాతం సబ్సిడీగా నిర్ణయించారు. దీంతో జీలుగు విత్తనాల కిలో ధర రూ.93 కాగా సబ్సిడీపై రూ.37.20కు, జనుము విత్తనాలు కిలో ధర రూ.90.50 కాగా రూ.36.20కు, పిల్లి పెసర కిలో ధర రూ.135.50 కాగా రూ.54.20కే రైతులకు అందిస్తారు.

విత్తనాల వివరాలు, ధరలు

విత్తనం	బ్యాగు పరిమాణం (కిలోల్లో)	ధర (రూ.ల్లో)
జీలుగు	30	1,116.00
జనుము	40	1,448.00
పిల్లి పెసర	20	1,084.00

నేటి నుంచి విక్రయాలు

పచ్చిరొట్ట విత్తనాలను ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు, ఆగ్రో సేవా కేంద్రాల ద్వారా గురువారం నుంచి రైతులకు పంపిణీ చేయనున్నారు. ఖమ్మం జిల్లాలో 76, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 26 పీఏసీఎస్‌లతో పాటు రెండు జిల్లాల్లోని ఆరు ఆగ్రో సేవా కేంద్రాల ద్వారా పచ్చి రొట్ట విత్తనాలను విక్రయించేందుకు విత్తనాభివృద్ధి సంస్థ ఏర్పాట్లు చేసింది. రైతులకు అవసరమైన మేర పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రాంతీయ మేనేజర్ బిక్షం వెల్లడించారు.

వచ్చేనెల 6 వరకు ఖమ్మం మార్కెట్‌కు సెలవులు

ఖమ్మంవ్యవసాయం: ఎండ తీవ్రత నేపథ్యాన ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సెలవులను జూన్ 6వ తేదీ వరకు పొడిగించినట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా సెలవులు ఇవ్వాలని కార్మిక వర్గాల ప్రతినిధులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి బృందం అభ్యర్థించగా, తొలుత ఈనెల 11నుంచి 20వ తేదీ వరకు సెలవులు ప్రకటించారు. అయితే, సెలవులు మరికొన్ని రోజులుగా పొడిగించాలని కోరడంతో వచ్చేనెల 6వ తేదీ వరకు సెలవులు కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

ఉద్యోగ భద్రత లేదు.. జీతాలు రావు

- జీపీల్లో కంప్యూటర్ ఆపరేటర్ల అవస్థలు
- నెలల తరబడి వేతనాలు అందక ఆవేదన
- ఇకనైనా ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలని వినతులు



ఎర్రుపాలెంలో విధులు నిర్వర్తిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు

ఎర్రుపాలెం: గ్రామపంచాయతీల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు సర్టిఫికెట్ల జారీ, ఇంటి పన్నుల వివరాలను ఆన్‌లైన్ చేయడం తదితర విధుల కోసం గత ప్రభుత్వం కంప్యూటర్ ఆపరేటర్లను నియమించింది. పంచాయతీలను క్లస్టర్లుగా విభజించి ఏడు నుంచి ఎనిమిది జీపీలకు ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను ఔట్ సోర్సింగ్ విధానంలో నియమించారు. ఇందులో భాగంగా ప్రస్తుతం జిల్లాలో 75 మంది విధులు నిర్వర్తిస్తుండగా వీరికి నెలల తరబడి వేతనాలు అందక కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నారు. ఔట్ సోర్సింగ్ విధానం కావడంతో ఉద్యోగ భద్రత లేదని ఆవేదన చెందుతుండగా.. ఇంకోపక్క నెలలుగా వేతనాలు సైతం అందడం లేదు. అయితే, ఆపరేటర్ల వరుస వినతులతో జనవరి, ఫిబ్రవరి వేతనాన్ని ఈనెల 17న చెల్లించారు. అయినప్పటికీ మార్చి, ఏప్రిల్ నెలల వేతనాలు అందాల్సి ఉండగా.. మే నెల కూడా ముగియవస్తున్నందున ఏ నెలకానెల వేతనం చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రెండు చోట్ల విధులు

నిబంధనల ప్రకారం ఆపరేటర్లు గ్రామపంచాయతీలకు సంబంధించిన విధులే నిర్వర్తించాలి. కానీ వీరిని మండల పరిషత్ కార్యాలయంలో ఆన్‌లైన్ ప్రక్రియకు సైతం వినియోగిస్తున్నారు. పల్లె ప్రగతి, హరితహారం, ఆసరా ఫించన్లు, జనన, మరణ ధృవపత్రాల జారీ, భవన నిర్మాణ అనుమతులు, ఈ–గ్రామ్ స్వరాజ్, ఆదాయ, వ్యయాల కంప్యూటీకరణ తదితర విధులు నిర్వర్తిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు చేసే పనులన్నింటినీ వీరు కంప్యూటరీకరణ చేస్తున్నారు. ఈమేరకు గ్రామాలు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు సాధించడం వెనుక ఆపరేటర్ల కృషి ఉన్నా వారికి వేతనాలు చెల్లింపులో పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

వెంటాడుతున్న సమస్యలు

కంప్యూటర్ ఆపరేటర్లకు జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ ఇవ్వాలని, ఉద్యోగాలు పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, మహిళా ఉద్యోగులకు వేతనాలతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కొన్నాళ్లుగా కోరుతున్నారు. అలాగే, ఉద్యోగి మరణిస్తే కుటుంబీకుల్లో ఒకరికి అవకాశం ఇవ్వాలని ప్రభుత్వానికి పలుమార్లు వినతిపత్రాలు అందచేశారు. ఇవేవీ పరిష్కారం కాకపోగా ఇప్పుడు వేతనాలు కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) హరికిషన్‌ను వివరణ కోరగా... పంచాయతీలకు గ్రాంట్ రాలేదని, మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలు పంపిణీ చేశాక నిధులు మిగిలితే కంప్యూటర్ ఆపరేటర్లకు ఇవ్వాలని సూచించినట్లు చెప్పారు.

వేతనాలు అందక ఇబ్బంది



గత రెండు నెలలుగా వేతనాలు రాక కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నాం. నెలలు తరబడిగా వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతకాలో తెలియడం లేదు. ఒక్కోసారి రాత్రి పొద్దుపోయే వరకు పనిచేయాల్సి వస్తోంది. ఇకనైనా పెండింగ్ వేతనాలు విడుదల చేసి పనికి తగిన వేతనం చెల్లించాలి.

– నాగిరెడ్డి నాగబాబు, కంప్యూటర్ ఆపరేటర్, ఎర్రుపాలెం

ఉద్యోగ భద్రత కల్పించాలి...



పదేళ్లకు పైగా విధులు నిర్వర్తిస్తున్నాం. పని భారం పెరిగి ఒక్కో రోజు రాత్రి 7గంటల దాటాకే ఇంటికి వెళ్తున్నాం. అయినా పనికి తగిన వేతనం ఇవ్వడం లేదు. ఇకనైనా రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి. అలాగే, పెండింగ్ వేతనాలు చెల్లించి క్రమం తప్పకుండా జీతం విడుదల చేయాలి.

– గుర్రం చెన్నారావు, ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

మంత్రులకు విన్నవించాం



పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్కకు వినతిపత్రాలు అందచేశాం. వచ్చే వేతనాలతో కుటుంబాలు గడవడం లేదు. జీతాలు పెంచడమే కాక మా ఉద్యోగాలను రెగ్యులర్ చేసే దిశగా చర్యలు తీసుకోవాలి.

– గ్యారా తిరుపతిరావు, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ఉపాధ్యాయుడి కుటుంబానికి 'సంక్షేమ నిధి పథకం' చెక్కు



ఉపాధ్యాయుడి కుటుంబానికి చెక్కు అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఖమ్మం సహకారనగర్: వైరా మండలం రెబ్బవరం ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు మహమూద్ అలీ ఇటీవల మృతి చెందగా, తమ సంఘం ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన కుటుంబ సంక్షేమ నిధి పథకం నుంచి రూ.6లక్షల చెక్కును ఆయన కుటుంబానికి అందజేసినట్లు టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుటుంబ సంక్షేమ నిధి పథకం చైర్మన్ చావా రవి తెలిపారు. ఖమ్మంలో బుధవారం నిర్వహించిన మహమూద్ అలీ సంస్మరణ సభలో చెక్కు అందచేశాక వారు మాట్లాడారు. వివిధ కారణాలతో మృత్యువాత పడిన ఉపాధ్యాయులను ఆదుకోవడాన్ని సామాజిక బాధ్యతగా భావించి కుటుంబ సంక్షేమ నిధి పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 23 మంది ఉపాధ్యాయుల కుటుంబాలకు రూ.6లక్షల చొప్పున రూ.1.38కోట్లు అందించినట్లు చెప్పారు. కాగా, పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు పూర్తి చేయాలని, పాఠశాలల్లోని ఖాళీల్లో విద్యావలంటీర్లను నియమించడమే కాక స్కావెంజర్లు నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గా భవాని, కోశాధికారి లక్ష్మారెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావుతో పాటు వల్లంకొండ రాంబాబు, షేక్ రంజాన్, షేక్ ఉద్దండ్, షరీఫ్, షమీ, రామకృష్ణ, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం అమలేది?



సమావేశంలో మాట్లాడుతున్న ఆజాద్

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలోని ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నా ప్రభుత్వం నియంత్రణ చట్టాన్ని అమలు చేయడంలో విఫలమైందని పీడీఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి నామల ఆజాద్ విమర్శించారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం నిర్వహించిన పీడీఎస్‌యూ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు ఎల్‌కేజీ నుండే రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను పీల్చిపిప్పి చేస్తున్నారని, టెక్నో, ఈ టెక్నో, ఐఐటీ పేర్లతో మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.లక్ష్మణ్, వి.వెంకటేష్, నాయకులు కరుణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

ఎర్రుపాలెం: మండలంలోని బుచ్చిరెడ్డిపాలెం శివార్లలో పలువురు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో మంగళవారం రాత్రి తనిఖీలు చేపట్టిన ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ పి.వెంకటేష్ తెలిపారు. మండలంలోని బుచ్చిరెడ్డిపాలెం, అయ్యవారిగూడెం, పెగళ్లపాడు, చొప్పకట్లపాలెం, బనిగండ్లపాడుకు చెందిన పలువురు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో తనిఖీలు చేపట్టామని వెల్లడించారు. ఈ మేరకు ఏడుగురు పట్టుబడగా, ముగ్గురు పరారయ్యారని తెలిపారు. వీరి నుంచి రూ.6,120 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

ముదిగొండ: ప్రేమ విఫలమై పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథకం మేరకు.. ఖమ్మం శివారు అల్లీపురానికి చెందిన సుదుల దినేష్(18) ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 20వ తేదీన ముదిగొండ మండలం కమలాపురంలోని ఒక ఫంక్షన్‌కు వచ్చిన ఆయన ఎలుకల మందు తాగాడు. దీంతో ఆయనను ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. కాగా, ప్రేమ విఫలం కావడంతోనే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని దినేష్ తండ్రి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేసినట్లు ముదిగొండ ఎస్సై నరేష్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆంబోతు మృతి

ఎదుళ్లచెరువులో ఊరేగింపుగా అంత్యక్రియలు

తిరుమలాయపాలెం: విద్యుదాఘాతంతో ఎదుళ్లచెరువు గ్రామానికి చెందిన ఆంబోతు బుధవారం మృతి చెందింది. గ్రామానికి చెందిన ఆంబోతు డోర్నకల్ మండలంలోని మన్నెగూడెం వెళ్లగా విద్యుత్ తీగకు తగిలి మృత్యువాత పడింది. దీంతో పాటు మరో ఐదు ఆవులు కూడా మృతి చెందాయి. ఈ విషయం తెలుసుకున్న ఎదుళ్లచెరువు గ్రామస్తులు ట్రాక్టర్‌లో ఆంబోదు కళేబరాన్ని గ్రామానికి తీసుకొచ్చి పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి అంత్యక్రియలు పూర్తిచేశారు. గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ ప్రతిష్ఠాపన సందర్భంగా చారి అనే వ్యక్తి ఆంబోతును ఇవ్వగా.. నాలుగేళ్లుగా గ్రామస్తులు దైవస్వరూపంగా భావించి పూజలు చేస్తున్నారు.

డీసీహెచ్‌ఎస్ సతీమణి మృతిపై సంతాపం

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయ(డీసీహెచ్‌ఎస్) అధికారి డాక్టర్ బి.వెంకటేశ్వర్లు సతీమణి భూక్యా విజయ భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలం అంజనాపురంలో గురువారం మృతి చెందారు. కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతున్న ఆమెకు ఖమ్మంలో చికిత్స చేయిస్తుండగా కన్నుమూశారు. ఈమేరకు ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ భద్రునాయక్ తదితరులు అంజనాపురంలో విజయ మృతదేహం వద్ద నివాళులర్పించి ఆమె భర్త వెంకటేశ్వర్లు, కుటుంబీకులను పరామర్శించారు.

ఎన్నికల విధులపై అవగాహన

- ఎక్కడా పొరపాటు జరగకుండా పనిచేయాలి
- ఎమ్మెల్సీ పోలింగ్‌పై శిక్షణలో కలెక్టర్ గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుతల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఈనెల 27న జరగనున్నందున ఎన్నికల విధులు, బాధ్యతలపై సెక్టార్ అధికారులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో సెక్టార్ అధికారులకు బుధవారం శిక్షణ నిర్వహించగా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడా చిన్న పొరపాటు జరగకుండా విధులు నిర్వర్తించాలన్నారు. సెక్టార్ అధికారులు ముందుగానే పోలింగ్ కేంద్రాల సందర్శించి మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని తెలిపారు. కాగా, 52మంది అభ్యర్థులు బరిలో ఉండగా నోటాతో కలిపి బ్యాలెట్ పేపర్‌తో 53 గుర్తులు ఉంటాయన్నారు. జిల్లాలో 83,879 మంది పట్టభద్రులు ఓటర్లకు గాను 118 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేశామని, 27న ఉదయం 8నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని చెప్పారు. ఇప్పటికే 129 బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేసి, తహసీల్దార్లను సెక్టార్ అధికారులుగా నియమించామన్నారు. ఈనెల 26న ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల నుంచి సామగ్రి తీసుకుని పోలింగ్ కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లా స్థాయి మాస్టర్ ట్రెయినర్ కె.శ్రీరామ్ విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు.

ఎడమ చేయి మధ్య వేలిపై మార్క్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ బుధవారం హైదరాబాద్ నుండి వీసీ ద్వారా సమీక్షించారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఉద్యోగులకు ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఇటీవలే లోక్‌సభ ఎన్నికలు ముగిసినందున ఓటరు ఎడమ చేయి మధ్య వేలిపై ఇంక్ మార్క్ వేయాల్సి ఉంటుందని చెప్పారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, డీఆర్వో రాజేశ్వరి, జెడ్పీసీఈఓ వినోద్, డీఆర్డీఓ సన్యాసయ్య, ఆర్డీఓలు జి. గణేష్, ఎల్.రాజేందర్‌గౌడ్, వివిధ శాఖల ఉద్యోగులు అరుణ, రాంబాబు, మదన్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేసినట్లు ఖమ్మం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన అభ్యర్థులు, వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్లు లెక్కించనుండగా, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా హాళ్లు సిద్ధం చేశామని తెలిపారు. ఒక్కో హాల్‌లో 14 టేబుళ్లు, ఖమ్మం నియోజకవర్గ హాల్‌లో 18 టేబుళ్లు ఉంటాయని చెప్పారు. కాగా, అభ్యర్థులు 117 మంది ఏజెంట్లను నియమించుకోవచ్చని, ఇందుకోసం వివరాలను ఫారం 18ద్వారా గురువారం సాయంత్రంలోగా సమర్పించాలని తెలిపారు. జూన్ 4న ఉదయం ఐదు గంటలకు స్ట్రాంగ్ రూంలు పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల సమక్షాన తెరిచి 8గంటలకు లెక్కింపు ప్రారంభిస్తామని వెల్లడించారు.

పంటల బీమా పథకాల అమలుపై శిక్షణ



పంటల బీమాపై వివరిస్తున్న డీఆర్పీ రాజు, వేదికపై కమిషనరేట్ కార్యాలయ అధికారి అనిత తదితరులు

ఖమ్మంవ్యవసాయం: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత బీమా పథకాల అమలుకు కసరత్తు జరుగుతుండగా.. ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని వ్యవసాయాధికారులు, ఎంపిక చేసిన రైతులకు బుధవారం ఖమ్మం కలెక్టర్‌లో శిక్షణ ఏర్పాటు చేశారు. కమిషనరేట్ కార్యాలయానికి చెందిన ఏడీఏ అనిత ఆధ్వర్యాన ఈ సమావేశం జరగగా, వరి, మొక్కజొన్న, పెసర, మినుము, కంది పంటలకు కేంద్ర ప్రభుత్వం అమలుచేసే ప్రధాన మంత్రి బీమా పథకం, పత్తి, మిర్చి, మామిడి వంటి పంటలకు అమలుచేస్తున్న వాతావరణ ఆధారిత బీమా పథకాల విధివిధానాలపై రిసోర్స్ పర్సన్లు (డీఆర్పీ) రాజు, సాయినారాయణ వివరించారు. బీమా ప్రీమియం వాటా, చెల్లింపు విధానం తదితర అంశాలపై వ్యవసాయాధికారులు, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం రెండు జిల్లాల నుంచి హాజరైన రైతుల అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో ఖమ్మం డీఏఓ ఎం.విజయనిర్మల, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ప్రణాళిక అధికారులు శ్రీనివాసరావు, శ్రీనివాస్, ఉద్యాన అధికారులు బీవీ.రమణ, సూర్యనారాయణ, కేవీకే కోఆర్డినేటర్లు డాక్టర్ రవికుమార్, డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.